

పంచాయతీలు అస్తవ్యస్తం!

గ్రామ పంచాయతీల పాలనపై ప్రత్యేక అధికారులు దృష్టి సారించడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 8లో



ఆధునిక పద్ధతుల్లో సాగు..

రైతులు ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేస్తూ అధిక దిగుబడి సాధించాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు సూచించారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
34° / 19°

జిల్లాలో శుక్రవారం ఎండల ప్రభావం అధికంగా ఉంటుంది. రాత్రికి మాత్రం వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

రమణీయం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం రమణీయంగా సాగింది. గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజల అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, శ్రీ సీతారామచంద్రస్వామి వారిని ఐఏఎస్ అధికారి బాలాజీ మంజులే దర్శించుకోగా, భద్రాచలానికి చెందిన ముసులూరి మస్తాన్‌రావు – లక్ష్మి దంపతులు స్వామి ప్రసాదానికి ఉపయోగపడే రూ.30వేల విలువైన పాత్ర అందజేశారు.

నేటితో వాగ్గేయకారోత్సవాల ముగింపు..

దేవస్థానంలో ఐదు రోజులుగా జరుగుతున్న భక్తరామదాసు జయంతి ఉత్సవాలు శుక్రవారంతో ముగియనున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంగీత, వాయిద్య కళాకారులు రామనామ కీర్తనలతో భక్తులను అలరించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం వైభవంగా సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. అర్చకులు108 సువర్ణ పుష్పాలతో ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి హారతి, మంత్రపుష్పం, నివేదన సమర్పించారు. కార్యక్రమంలో అర్చకులు పద్మనాభ శర్మ, రవికుమార్ శర్మ, ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి, కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులు పాల్గొన్నారు.

జేఎల్‌ఎంల ఎంపిక ప్రక్రియ పూర్తి



స్తంభం ఎక్కుతున్న అభ్యర్థి

ఖమ్మంవ్యవసాయం: ఎన్పీడీసీఎల్ పరిధిలో జూనియర్ లైన్‌మెన్ల నాలుగో దశ ఎంపిక ప్రక్రియ ముగిసింది. 2019లో నిర్వహించిన పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు దశలవారీగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 13మందికి సమాచారం ఇవ్వగా, ఖమ్మంలో గురువారం నిర్వహించిన పరీక్షకు 12మంది హాజరయ్యారు. ఎస్ఈ ఏ.సురేందర్ చైర్మన్‌గా నియామకమైన కమిటీ ఆధ్వర్యాన అభ్యర్థుల ధృవీకరణ పత్రాలను పరిశీలించాక స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహించారు. కాగా, పరిశీలకులుగా ఎన్పీడీసీఎల్ సీజీఎం అశోక్‌కుమార్ వ్యవహరించగా, డీఈలు బాబూరావు, నాగేశ్వరరావు, జిలానీ పాషా పర్యవేక్షించారు. వీడియో చిత్రీకరణ నడుమ నిర్వహించిన పరీక్షను హనుమకొండ నుంచి ఎన్పీడీసీఎల్ సీఎండీ పరిశీలించారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన వారి వివరాలతో కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా అభ్యర్థులకు పోస్టింగ్ ఇచ్చే అవకాశముంది.

సీఓఈల్లో ప్రవేశానికి 18న పరీక్ష

భద్రాచలంఅర్బన్: తెలంగాణ గిరిజన గురుకుల ప్రతిభా కళాశాలల్లో కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీఓఈ)గా గుర్తించిన వాటిలో ప్రవేశానికి ఈనెల 18 పరీక్ష నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 3,081మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, ఎనిమిది కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. భద్రాచలంలోని సీఓఈ–2, దమ్మపేటలోని సీఓఈ, మణుగూరు, కొత్తగూడెంలోని యూఆర్‌జేసీలు, అంకంపాలెంలోని ఆర్‌జేసీ, భద్రాచలంలోని ఈఎంఆర్ఎస్, సింగరేణి ఈఎంఆర్ఎస్‌తో పాటు ఖమ్మంలోని ఆర్డీసీలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఉదయం 8గంటలకల్లా హాల్‌టికెట్, ఆధార్‌కార్డు, ప్యాడ్, పెన్నులతో హాజరుకావాలని పీఓ సూచించారు.

వైద్యం అందేదెలా?



సిబ్బంది కొరత వేధిస్తున్న భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు అంతంతే..

- జీవో 370తో నర్సింగ్ సిబ్బంది చెల్లాచెదురు
- అన్ని పీహెచ్‌సీలనూ వేధిస్తున్న కొరత
- భద్రాద్రి ఆస్పత్రి పరిస్థితి మరీ దారుణం

భద్రాచలం: అసలే డాక్టర్లు, సిబ్బంది కొరతతో పేదలకు అంతంతమాత్రంగానే వైద్య సేవలు అందుతుండగా.. జీఓ 370తో ఈ సమస్య రెట్టింపైంది. ఈ జీఓతో జోన్ లెవల్ బదిలీలు జరగగా, జిల్లాలోని అన్ని ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో సిబ్బంది కొరత ఏర్పడుతోంది. ముఖ్యంగా నాలుగు రాష్ట్రాల ప్రజలకు పెద్ద దిక్కుగా ఉన్న భద్రాచలం ఏరియా ఆస్పత్రి పరిస్థితి మరింత దారుణంగా మారింది. 200 పడకలు ఉన్న కొత్త, పాత ఆస్పత్రి భవనాల్లోని వార్డులలో నర్సింగ్ సిబ్బంది లేక పేషెంట్లు ఇబ్బంది పడుతున్నారు. ఎమర్జెన్సీ వార్డుల్లోనూ అత్యవసర వైద్యం అందడం లేదు.

24 మందికి స్థానచలనం..

భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మొదట 100 పడకలు ఉండగా, ఆ తర్వాత 200 పడకలకు అప్‌గ్రేడ్ అయింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన పేద, మధ్యతరగతి ప్రజలు, ముఖ్యంగా గిరిజనులకు ఈ ఆస్పత్రి పెద్దదిక్కుగా ఉంది. అసలే వైద్యులు, సిబ్బంది పూర్తి స్థాయిలో భర్తీ కాకపోగా, ఉన్నవారు సైతం డిప్యుటేషన్‌పై జిల్లాలోని ఇతర పీహెచ్‌సీలకు వెళ్లడంతో సేవలలో అంతరాయం కలుగుతోంది. ఇక ఇటీవల ప్రభుత్వం జీఓ 370 అమలు చేయడంతో ఈ సమస్య మరింతగా పెరిగింది. ఈ ఆస్పత్రిలో రెగ్యులర్ నర్సింగ్ పోస్టులు 82 ఉండగా, 58 పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయి. 24 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక పది రోజుల క్రితం జీఓ 370 అమలు చేయగా 58లో 24 మంది జోనల్ స్థాయిలో ఇతర జిల్లాలకు వెళ్లారు.

14 వార్డులకు 28 మందే..

భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ఓపీ, ఓటీ, ట్యూబెక్టమీ, ఎస్ఎన్‌సీయూ, పీడియాట్రిక్, ఎమర్జెన్సీ వంటి 14 వార్డులు ఉన్నాయి. ఇందులో మూడు షిఫ్టుల వారీగా నర్సింగ్ సిబ్బంది పనిచేయాల్సి ఉంది. అన్ని వార్డుల్లో కలిపి సుమారు 100 మంది సిబ్బంది అవసరం. అయితే ఒక్కో షిఫ్టుకు అన్ని వార్డుల్లో కలిపి ఇద్దరు చొప్పున కూడా లేని దుస్థితి నెలకొంది. భద్రాచలం ఆస్పత్రితో పాటు మణుగూరు, పాల్వంచ, కొత్తగూడెం, ఇతర మండల కేంద్రాల్లోని ఆస్పత్రులనూ ఇదే సమస్య వెంటాడుతోంది. అయితే నర్సింగ్ కళాశాలల్లో అప్రెంటిస్ విద్యార్థులు ఉండడం కొంతవరకు ఉపశమనం కలిగిస్తోంది.

ఏజెన్సీలో భర్తీ కాని పోస్టులు..

జోనల్ స్థాయిలో బదిలీలు కావడంతో ఈ 24 మంది సిబ్బందిలో కేవలం ముగ్గురే భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తిరిగి వచ్చారు. మిగతా సిబ్బంది ఇతర జిల్లాలకు వెళ్లిపోయారు. బదిలీ తప్పనిసరి కావడంతో కాళేశ్వరం, బాసర, సిరిసిల్ల వంటి దూరప్రాంతాలకు సైతం వెళ్లాల్సి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు. ఇక భద్రాచలం పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం కావడంతో ఇతర జిల్లాల వారు ఇక్కడికి వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు.

డాక్టర్ ఎమ్మెల్యే, పీఓ ఉన్నచోటే ఇలా..

ఇటీవల ఎన్నికల్లో భద్రాచలం నియోజకవర్గం నుంచి వైద్యుడైన తెల్లం వెంకట్రావు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయనకు ఈ ప్రాంతంలోని పలు ఆస్పత్రులతో పాటు భద్రాచలం ఏరియా ఆస్పత్రిలోనూ పనిచేసిన అనుభవం ఉంది. గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాల్సిన ఆవశ్యకత కూడా ఆయనకు తెలుసు. అయితే జీఓ 370 అమలుతో ఈ ఆస్పత్రిలో నెలకొన్న ఇబ్బందుల గురించి వైద్యారోగ్య శాఖ మంత్రి, ఆ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో వెంకట్రావు విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక గిరిజనాభివృద్ధే ధ్యేయంగా పనిచేసే ఐటీడీఏ కూడా ఇక్కడే ఉన్నా.. వైద్య సేవల గురించి అధికారులు పట్టించుకోవడం లేదని గిరిజన సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఐటీడీఏ అధికారులు దృష్టి సారించి నర్సింగ్ సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని పలువురు కోరుతున్నారు. దీనిపై డీఎంహెచ్ఓ శిరీష ను ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

అసెంబ్లీలో ప్రస్తావించా..



భద్రాచలం ఏరియా ఆస్పత్రి సమస్యలను గురువారమే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించా. వైద్యులు, సిబ్బంది కొరత సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లా. అన్ని వార్డుల్లో పూర్తి స్థాయిలో సిబ్బంది పనిచేసేలా కృషి చేస్తా. కరకట్ట పొడిగింపునకు చేసిన టెండర్ పనులను వెంటనే అమలు చేయాలని కూడా కోరాను.

– తెల్లం వెంకట్రావ్, ఎమ్మెల్యే

నిత్యాన్నదానానికి భారీ విరాళం

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదానానికి ఏపీలోని ఏలూరుకు చెందిన డాక్టర్ రాధిక తన తండ్రి డాక్టర్ యార్లగడ్డ చంద్రమౌళితో కలిసి రూ.25లక్షల చెక్కును ఈఓ రమాదేవికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారిని సన్మానించి స్వామి దర్శనం చేయించారు.

అవకాశం ఇస్తే ఎంపీగా పోటీకి సిద్ధం

మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర



మాట్లాడుతున్న చందా లింగయ్య

కరకగూడెం: సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న తనకు కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇస్తే మహబూబాబాద్ ఎంపీగా పోటీకి సిద్ధమని మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర తెలిపారు. కరకగూడెం మండలం చిరుమళ్లలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2009 నుంచి మహబూబాబాద్, ఆదిలాబాద్ ఎంపీ స్థానాలను ఆదివాసీలకు కేటాయించాలని కోరినా మూడు మార్లు మహబూబాబాద్ ఎంపీ టికెట్ వలస లంబాడీలకే కేటాయించారని ఆరోపించారు. అంతేకాకుండా ఈ ఎన్నికల్లోనూ లంబాడీలకే టికెట్ ఇవ్వాలని ఢిల్లీకి ప్రతిపాదించడం సరికాదన్నారు. ఆదివాసీలు, ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి పాటుపడిన తన సేవలను గుర్తించాలని కోరారు. అలాగే, తన కుమారుడు సంతోష్ ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఆశిస్తే బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికి టికెట్ ఇచ్చి తమకు కాంగ్రెస్ అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరిని రాజ్యసభకు ఎంపిక చేయడంపై అధిష్టానానికి లింగయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు నాగేశ్వరరావు, లాలూప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

‘ఖేలో భద్రాద్రి’ పోటీలు షురూ

- మూడు రోజుల పాటు కొనసాగనున్న క్రీడలు
- ప్రారంభించిన ఎస్పీ, అదనపు కలెక్టర్
- ఉత్సాహంగా పాల్గొంటున్న ఉద్యోగులు



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్, పక్కన అదనపు కలెక్టర్ రాంబాబు

కొత్తగూడెంటౌన్: జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ సిబ్బందికి కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఖేలో భద్రాద్రి క్రీడా పోటీలను ఎస్పీ బి.రోహిత్‌రాజ్, అదనపు కలెక్టర్ పి.రాంబాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నిత్యం ఉద్యోగ బాధ్యతల్లో నిమగ్నమయ్యే వారికి ఈ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని చెప్పారు. టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. క్రీడల్లో ఉద్యోగులంతా పాల్గొనడంతో వారిలో ఐక్యత, పరిచయాలు పెరుగుతాయని చెప్పారు. తారతమ్యాలు మరిచి అంతా సమానమనే భావన కలుగుతుందని, స్నేహభావం పెంపొందుతుందని అన్నారు. అదనపు కలెక్టర్ పి. రాంబాబు మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని విభాగాల్లో గల గెజిటెడ్ –నాన్ గెజిటెడ్ ఉద్యోగులు ఖేలో భద్రాద్రి సంబురాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఉద్యోగులు మానసికంగా, ఆరోగ్యపరంగా దృఢంగా ఉండేందుకు ఈ క్రీడలు దోహదం చేస్తాయని వివరించారు. కాగా, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అమరనేని రామారావు, కంచర్ల సాయి భార్గవ చైతన్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలు శుక్ర, శనివారాల్లోనూ కొనసాగనున్నాయి. క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, టెన్నికాయిట్, మ్యూజికల్ చైర్, స్కిప్పింగ్, అథ్లెటిక్స్ విభాగాల్లో జరిగే ఈ పోటీలకు జిల్లాలోని ఉద్యోగులను 295 టీమ్‌లు విభజించారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి టి.సీతారాం, టీఎన్‌జీవోస్ రాష్ట్ర కార్యదర్శి జి. వీరబాబు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు రామనర్సయ్య, సభ్యులు పి.ప్రకాష్, జానీమియా, జె.సోమయ్య, ఎం.విజయలక్ష్మి, జి.ఉష, టూటౌన్, త్రీటౌన్ సీఐలు రమేష్‌కుమార్, మురళి, ఎస్సై విజయ తదితరులు పాల్గొన్నారు.

పోటీల నిర్వహణ ఆనందంగా ఉంది



జిల్లాకు చెందిన గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులతో కలిసి మూడు రోజుల పాటు పండుగలా క్రీడా పోటీలు నిర్వహించుకుంటాం. పోటీలకు ఉద్యోగుల నుంచి అనూహ్య స్పందన లభించింది. అందరి సహకారంతో పోటీలు ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉంది. ఉద్యోగుల్లో ఐకమత్యం కోసం ఇలాంటి వేదికలు ఎంతగానో ఉపయోగపడతాయి.

–అమరనేని రామారావు, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు

మా ఆరోగ్యాన్ని పట్టించుకోండి..



ప్రజాభిప్రాయ సేకరణ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక అల



నిరసన తెలియజేస్తున్న నాయకులు, నిర్వాసితులు

- దుమ్ము, ధూళితో ఇబ్బంది పడుతున్నాం
- సింగరేణి నిధులు కూడా ప్రభావిత గ్రామాలకు అందడం లేదు
- కోయగూడెం ఓసీ ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికుల ఆవేదన
- అభివృద్ధి పనులకు రూ.825 కోట్లు కేటాయిస్తామన్న కలెక్టర్

టేకులపల్లి : ‘కేటీసీ నుంచి వెలువడే దుమ్ము, ధూళితో అనారోగ్యాల పాలవుతున్నాం.. మా ఆరోగ్యాల గురించి పట్టించుకునే నాథుడే లేడ’ని ప్రభావిత గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కోయగూడెం ఓపెన్ కాస్ట్–2 పిట్ 1లో రెండు మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ 2019 సెప్టెంబర్ 13న అనుమతి ఇచ్చింది. అయితే వివిధ అవసరాలు, డిమాండ్ నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తి పెంచాల్సి వచ్చింది. ఈ క్రమంలో మూడు మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి పర్యావరణ అనుమతి కోసం గురువారం కలెక్టర్ ప్రియాంక అల, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ బి.రవీందర్ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు ఇద్దరు లేచి సింగరేణి సంస్థ ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తోందని, తాగు, సాగునీరు ఇస్తోందని, రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారని చెబుతుండగా.. వివిధ రాజకీయ, సంఘాల నాయకులు, ప్రజలు అభ్యంతరం తెలిపారు. ఇదంతా అసత్యమని, సింగరేణి అధికారులే వారితో ఇలా మాట్లాడిస్తున్నారని మండిపడ్డారు. మౌలిక సదుపాయాలు, నిధులు, అభివృద్ధి, సంక్షేమం గురించి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కేటీసీ1, 2 ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. పెట్రాంచెలక, సామ్యాతండా, తుమ్మలచెలక, కుంటల్ల, రేగులతండా, దాసుతండా, టేకులపల్లి తదితర ప్రాంతాల ప్రజలు దుమ్ము ధూళితో ఇబ్బంది పడుతున్నా కనీసం వైద్య శిబిరాలు కూడా ఏర్పాటు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దుమ్ము లేవకుండా నీరు చల్లడం లేదని, రోడ్లు, డ్రైనేజీలు, వీధి లైట్లు లేవని, సురక్షిత తాగునీరు అందడం లేదని తెలిపారు. ఓసీతో చెరువుల్లో నీరు కూడా సాగుకు పనికి రావడం లేదని, రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.

సింగరేణి నిధుల్లో ప్రాధాన్యత కల్పిస్తాం..

సింగరేణి నిధులను ప్రభావిత ప్రాంతాల్లో ఖర్చు చేసేందుకు ప్రాధాన్యత ఇస్తామని కలెక్టర్ ప్రియాంక అల చెప్పారు. మొత్తం రూ.700 కోట్లు మంజూరైతే రూ.20 కోట్లు మాత్రమే ఖర్చయ్యాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇది సరైంది కాదని అన్నారు. సింగరేణి డీఎంఎఫ్ నిధులు రూ.825 కోట్లతో జిల్లాలో అభివృద్ధి పనులు మంజూరు చేశామని, ఇకపై సింగరేణి నిధుల్లో అధిక శాతం కేటీసీ ప్రభావిత ప్రాంతాలకు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. స్థానికులు తమ దృష్టికి తెచ్చిన పలు సమస్యలు పరిష్కరించేలా సింగరేణి అధికారులతో మాట్లాడుతానని తెలిపారు. అవసరమైతే ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళతానని అన్నారు. ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ మాట్లాడుతూ.. కేటీసీ ప్రభావిత గ్రామాల్లో వీధి లైట్లు ఏర్పాటు చేస్తామని, పాఠశాలల అభివృద్ధికి చర్యలు చేపడతామని అన్నారు. దుమ్ము, ధూళి, తాగునీటితో పాటు అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పర్యావరణ జీఎం గణపతి, ఎస్‌వోటూ జీఎం మల్లారపు మల్లయ్య, ప్రాజెక్టు ఆఫీసర్లు ప్రహ్లాద్, బొల్లం వెంకటేశ్వర్లు, గని మేనేజర్ సౌరభ్ సుమన్, అఖిలపక్ష నాయకులు రేపాకుల శ్రీనివాస్, ఆవునూరి మధు, లక్కినేని సురేందర్‌రావు, దళ్‌సింగ్, జబ్బా విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు తనిఖీలు ముమ్మరం చేయాలని కలెక్టర్ ప్రియాంక అల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అంతర్‌రాష్ట్ర చెక్ పోస్టుల వద్ద 24 గంటలు తనిఖీలు నిర్వహించాలన్నారు. మణుగూరు, పినపాక మండలాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని, పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులతో తనిఖీల నిర్వహణకు టీమ్‌లను ఏర్పాటు చేయాలని అన్నారు. అనుమతి ఇచ్చిన రీచ్‌లు, స్టాక్‌పాయింట్ల నుంచి మాత్రమే ఇసుక తరలించాలని సూచించారు. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, అటవీ శాఖాధికారి కిష్టాగౌడ్, అదనపు కలెక్టర్ పి. రాంబాబు, డీఆర్‌డీఓ విద్యాచందన, ఏఎస్పీ పరితోష్ పంకజ్, రవాణా అధికారి వేణు, మైనింగ్ ఏడీ జైసింగ్, టీఎస్ఎండీసీ పీఓ శ్రీనివాస్, సర్వే ఏడీ కుసుమకుమారి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి..

మారుమూల గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని కలెక్టర్ అన్నారు. చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో ఈ సమస్య పరిష్కారానికి సోలార్ ద్వారా పంపుసెట్లు ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో మంచినీటి ట్యాంకులు ఏర్పాటు చేయాలని సూచించారు.

సమ్మె ప్రభావం ఉండేనా ?

- విజయవంతం చేయాలని జేఏసీ నేతల పిలుపు
- సింగరేణి కార్మికులు దూరంగా ఉండాలని సీఎండీ సూచన



బొగ్గు తవ్వుతున్న సింగరేణి కార్మికులు (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలంటూ వామపక్ష, కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు 16వ తేదీన(శుక్రవారం) సమ్మెకు పిలుపునిచ్చాయి. సింగరేణితో పాటు దేశవ్యాప్తంగా పలు పరిశ్రమల్లో కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అందించాలని, కార్మిక చట్టాల స్థానంలో తీసుకొచ్చిన లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని, రైతులకు నష్టం కలిగించే చట్టాలను వెనక్కు తీసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా సమ్మె చేస్తామని ఆయా సంఘాల నేతలు గతనెల 29న నోటీస్ అందించిన విషయం తెలిసిందే. సమ్మెను విజయవంతం చేయాలంటూ గనులు, పరిశ్రమలతో పాటు దేశవ్యాప్తంగా ఇప్పటికే విస్తృత ప్రచారం చేశారు.

కార్మిక సంఘాలతో చర్చలు..

దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు తలపెట్టిన సమ్మె డిమాండ్లతో సింగరేణి కార్మికులకు సంబంధం లేదని, కార్మికులు సమ్మెకు దూరంగా ఉండాలని ఇప్పటికే సీఎండీ బలరామ్ పిలుపునిచ్చారు. యాజమాన్యం ఇటీవల ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ నాయకులతో చర్చలు సైతం జరిపింది. ఈ ఏడాది నిర్దేశించుకున్న బొగ్గు ఉత్పత్తి, ఓబీలో కొంత వెనుకంజలో ఉన్నామని, ఈ సమయంలో సమ్మె చేస్తే మరింతగా వెనుకబడతామని పేర్కొంది. విద్యుత్ అవసరాల రీత్యా నిత్యం బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉంటుందని, లేదంటే లక్ష్య సాధన కష్టమని కార్మికుల దృష్టికి తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూనే విధులు నిర్వర్తించనున్నట్లు ఐఎన్‌టీయూసీ తెలిపింది. ఇక బీఎంఎస్, హెచ్ఎంఎస్ సమ్మెకు దూరంగా ఉన్నాయి. ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ తదితర వామపక్ష సంఘాలు మాత్రం సమ్మెకు సై అంటున్నాయి.

సమ్మెతో అందరికీ నష్టమే



కార్మికుల సమ్మెతో వారికి, సింగరేణి సంస్థకు కూడా నష్టం వస్తుంది. ఒకరోజు సమ్మెతో కార్మికులు రూ.18 కోట్ల మేర వేతనాలు కోల్పోతారు. బొగ్గు ఉత్పత్తి, ఓబీ నిలిచిపోవడంతో సంస్థకు సైతం రోజుకు రూ.85 కోట్ల మేర నష్టం వాటిల్లుతుంది. ఇక సమ్మె డిమాండ్లలో అత్యధికం సింగరేణి కార్మికులకు సంబంధించినవి కూడా కావు. ఏమైనా చిన్న చిన్న సమస్యలుంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలే తప్ప కార్మికులు సమ్మెకు దిగొద్దు.

– ఎస్.వి.కె.శ్రీనివాస్, డైరెక్టర్ (పా)

సింగరేణికి సంబంధం లేదు



జేఏసీ నాయకులు యాజమాన్యానికి ఇచ్చిన సమ్మె నోటీసులో సింగరేణికి సంబంధించిన ప్రధాన డిమాండ్లు ఏమీ లేవు. కేవలం రాజకీయ ప్రేరేపితంగా, కేంద్ర ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతోనే కొన్ని సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయి. తమ గుర్తింపును చాటేందుకు, పబ్బం గడుపుకునేందుకు ఆయా సంఘాలు చేస్తున్న సమ్మె ఇది. సింగరేణి కార్మికులు సమ్మెకు దూరంగా ఉండి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి.

– మొగిలిపాక రవి, బీఎంఎస్ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు

మోదీ, సింగరేణి విధానాలను ప్రతిఘటించాలి



కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కాంట్రాక్ట్ లేబర్ చట్టం సహా 29 చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చింది. ఇవి అమలైతే కాంట్రాక్ట్ కార్మికులు కట్టుబానిసలుగా మారే ప్రమాదం ఉంది. 2022 జనవరి 19 నుంచి పెండింగ్‌లో ఉన్న కనీస వేతన జీఓలను నేటికీ సవరించలేదు. సింగరేణి యాజమాన్యం కూడా కాంట్రాక్ట్ కార్మికులకు కోలిండియా వేతనాలు, కార్మిక చట్టాల అమలు చేయడం లేదు. యాజమాన్యం, కేంద్ర కార్మిక శాఖ అధికారుల సమక్షంలో 2022 సెప్టెంబర్ 26న జరిగిన ఒప్పందాన్ని ఇంకా అమలు చేయడం లేదు. కాంట్రాక్ట్ కార్మికులు ఐక్యతను చాటి సమ్మెను విజయవంతం చేయాలి.

– బి.మధు, ఎస్‌సీకేఎస్ ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

కేఎల్‌ఆర్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు



మాట్లాడుతున్న కేఎల్‌ఆర్ విద్యాసంస్థల చైర్మన్ నాగమణి

పాల్వంచ: పాల్వంచలోని కేఎల్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు ఎన్‌బీఏ(నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్) గుర్తింపు లభించిందని కేఎల్‌ఆర్ విద్యాసంస్థల చైర్మన్ కె.నాగమణి తెలిపారు. గురువారం కేఎల్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత డిసెంబర్ 8,9,10 తేదీల్లో ఎన్‌బీఏ నిపుణుల బృందం కళాశాలను తనిఖీ చేసిందన్నారు. సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ కోర్సుల్లో అందిస్తున్న విద్యాబోధన, వసతులను గుర్తించి ఎన్‌బీఏకు సిఫారసు చేయగా, ఫిబ్రవరి 14న గుర్తింపు ఇస్తున్నట్లు ప్రకటించారని వివరించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కేఎల్‌ఆర్ కళాశాలకు మాత్రమే ఎన్‌బీఏ గుర్తింపు లభించిందన్నారు. దీనివల్ల ఇక్కడ చదివే విద్యార్థులకు మంచి కంపెనీల నుంచి ప్లేస్‌మెంట్‌లు దక్కే అవకాశం ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సురేంద్ర కుమార్, డైరెక్టర్లు కె.మురళి, బి.మురళీప్రసాద్, బి.కాశీవిశ్వనాథ్, ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి రూ.1,10,220 వితరణ

అశ్వాపురం: మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీ ఏఈసీఎస్‌లో రెండో తరగతి చదువుతున్న తేజావత్ హరిణి(9) ప్రాణాంతక వ్యాధి అయిన లింఫోబ్లాస్టిక్ లుకేమియాతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతోంది. ఆమె వైద్యానికి కావాల్సిన నగదు లేక తల్లిదండ్రులు శంకర్–లత దాతల సాయం కోరారు. ఈవిషయం తెలుసుకున్న హరిణి స్నేహితుల తల్లిదండ్రులు గురువారం సమావేశమై రూ.1,10,220 జమ చేసి శంకర్‌కు అందజేశారు.

హెచ్‌ఎంలకు మెమో జారీ

సాక్షి ఎఫెక్ట్..

ఇల్లెందు: పట్టణంలోని సుభాష్‌నగర్, ఏబీఎస్ పాఠశాలలకు ఆప్షనల్ హాలీడే ఇవ్వటం చర్చనీయాంశంగా మారింది. గురువారం 'సాక్షి'లో 'ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్' శీర్షికన ప్రచురితమైన కథనానికి కలెక్టర్ ప్రియాంక ఆల స్పందించారు. డీఈఓ వెంకటేశ్వరాచారితో చర్చించి రెండు పాఠశాలల హెచ్‌ఎంలకు మెమో జారీ చేశారు. కాగా పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వరాదని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాలు పట్టించుకోకుండా వసంత పంచమి సందర్భంగా సెలవు ఇవ్వటంతో రెండు పాఠశాలలు మూతపడగా, అధికారులు చర్యలు తీసుకున్నారు.

బెల్ట్ గ్రేడింగ్‌లో విద్యార్థినుల సత్తా

మణుగూరు రూరల్ : ఈ నెల 14న హైదరాబాద్ ఫిల్మ్ నగర్‌లో నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో మణుగూరుకు చెందిన జక్కుల యామిని బ్లాక్‌బెల్ట్ ఫస్ట్ డాన్ సాధించింది. సినీ నటుడు, కరాటే లెజెండ్ సుమన్ చేతుల మీదుగా యామిని సర్టిఫికెట్ అందుకుంది. మాస్టర్లు కేశవ్ గౌడ్, పద్మ ఈ సందర్భంగా యామినిని అభినందించారు.

జీవనోపాధులకు శిక్షణ అవసరం

ఇల్లెందు/ఇల్లెందురూరల్ : వివిధ రంగాల్లో పని చేసే మహిళలు తాము ఎంచుకున్న మార్గంలో మెళకువలు, వృత్తి నైపుణ్యం కలిగి ఉండాలని, అప్పుడే రాణించగలుగుతారని జిల్లా ఉపాధి కల్పన, శిక్షణ అధికారి వేల్పుల విజేత తెలిపారు. గురువారం ఇల్లెందులోని సుభాష్‌నగర్ బాలాజీ కన్వెన్షన్ హాల్‌లో ప్రొడక్టివిటీ కౌన్సిల్ వారిచే నిరుద్యోగ మహిళలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. ఇలాంటి నైపుణ్య శిక్షణ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీపీసీ కో ఆర్డినేటర్ సత్యం, శిక్షణ నిర్వాహకులు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం శిక్షణలో నైపుణ్యం ప్రతిభ చాటిన నిరుద్యోగ మహిళలకు ధ్రువపత్రాలు అందజేశారు.

సున్నంబట్టి ఆశ్రమ విద్యార్థికి పాముకాటు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని సున్నంబట్టి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న నారం సూరిబాబుకు గురువారం పాముకాటు వేసింది. బాలుడి తల్లి అనురాధ కథనం ప్రకా రం.. గురువారం మధ్యాహ్నం భోజనం అనంతరం తోటి విద్యార్థులతో కలిసి సూరిబాబు పాఠశాల సమీపంలోని ఖాళీ స్థలంలోకి వెళ్లగా బాలుడిని పాము కాటు వేసింది. విద్యార్థిని అశ్వారావుపేట సీహెచ్‌సీకి తరలించగా, వైద్యుడు కృష్ణకాంత్ చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం బాలుడి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని డాక్టర్ తెలిపారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.12,595

పంచాయతీలు అస్తవ్యస్తం!

- ప్రత్యేకాధికారులకు పట్టని పాలన
- గ్రామాల్లో పారిశుద్ధ్యలోపం
- సర్వేలతో సతమతమవుతున్న కార్యదర్శులు





విద్యానగర్ ప్రధాన రహదారిపై నిల్వ ఉన్న మురుగు, (ఇన్‌సెట్) చుంచుపల్లి మండలంలోని ఓ పంచాయతీలో ఖాళీగా ప్రత్యేకాధికారి కుర్చీ

చుంచుపల్లి: గ్రామ పంచాయతీల పాలనపై ప్రత్యేక అధికారులు దృష్టి సారించడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల 2వ తేదీ నుంచి గ్రామ పాలన ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లగా, సర్పంచ్‌ల హయాంలోనే మెరుగైన సేవలు అందాయనే భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది. ప్రత్యేకాధికారులు వేర్వేరు ప్రభుత్వ శాఖల్లో పని చేస్తుండటంతో గ్రామాలకు చుట్టపుచూపుగా వచ్చి వెళ్తున్నారు.

అధ్వానంగా డ్రెయినేజీలు

అధికారుల పర్యవేక్షణలోపంతో ప్రధానంగా పారిశుద్ధ్య పనులు అస్తవ్యస్తంగా మారాయి. పల్లెల్లో చెత్త సేకరించకపోవడంతో వీధులన్నీ దుర్వాసన వెదజల్లుతున్నాయి. డ్రెయినేజీల్లో మురుగు స్తంభిస్తోంది. ఫలితంగా దోమల బెడద పెరిగింది. ఇక గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రజాపాలన దరఖాస్తుల ఇంటింటి సర్వేలకే పరిమితమయ్యారు. గడిచిన నాలుగైదు రోజులుగా గ్యాస్, గృహజ్యోతి ప్రజాపాలన దరఖాస్తుదారుల వివరాలను సేకరించే పనిలో బిజీగా ఉన్నారు. ఇటీవల ప్రత్యేక అధికారులుగా ఉన్న తహసీల్దార్లు, ఎంపీడీఓలు భారీగా బదిలీ అవ్వడంతో ప్రస్తుతం చాలా పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు లేరు. వీరి స్థానంలో కొత్తగా వచ్చే వారిని తిరిగి నియమించాల్సి ఉంటుంది.

కార్యదర్శులకు తప్పని పనిభారం

జిల్లాలో 481 గ్రామ పంచాయతీల పరిధిలో 353 జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, 24 మంది అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు, మరో 104 మంది రెగ్యులర్ కార్యదర్శులు పనిచేస్తున్నారు. ఇటీవల పంచాయతీలకు 218 మంది ప్రత్యేక అధికారులను నియమించారు. ఒక్కోక్క అధికారికి రెండు నుంచి మూడు గ్రామాల బాధ్యతలను అప్పగించారు. ప్రత్యేక అధికారుల పాలన వచ్చినా పంచాయతీ కార్యదర్శులకు పని భారం తప్పడం లేదు. మొన్నటి వరకు గ్రామాల్లో నెల కొన్న సమస్యల విషయంలో సర్పంచులు, వార్డు సభ్యులు దగ్గరుండి చూసుకునేవారు. ఇప్పుడు సర్పంచులు అందుబాటులో లేకపోవడంతో పంచాయతీల ఆలనాపాలనా కార్యదర్శులే చూడాల్సి వస్తోంది. కొత్త ప్రభుత్వ సంక్షేమ పథకాల పర్యవేక్షణ, సర్వేల బాధ్యతలతో ప్రస్తుతం పల్లెపాలనపై అంతగా దృష్టి పెట్టలేకపోతున్నారు. ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ దగ్గర నుంచి ఇప్పుడు జరుగుతున్న ఇంటింటి సర్వే వరకు అధికారులు అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఉదయం 8 గంటలకే విధులకు హాజరై ట్రాక్టర్ ద్వారా ఇంటింటికి చెత్త సేకరణ, ఉపాధి పనుల పర్యవేక్షణ, పల్లె ప్రకృతి వనాలు, ఇంటి పన్నుల వసూళ్లు, సిబ్బంది విధులు, మొక్కల సంరక్షణ, జనన, మరణ ధ్రువపత్రాలు జారీ, తాగునీటి, పలు రికార్డుల నిర్వహణ వంటి 18 రకాల పనుల పర్యవేక్షణతో విధుల పట్ల ఒత్తిడితో సతమతమవుతున్నారు. వీటికి తోడు ప్రభుత్వ సెలవు దినాల్లోనూ కుటుంబాలకు దూరంగా ఉంటూ పలు రకాల ప్రభుత్వ విధులు నిర్వహించాల్సి వస్తోందంటున్నారు. అటు ప్రత్యేక అధికారులు, ఇటు పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో లేకపోవడంతో పంచాయతీల్లో పాలన కుంటుపడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 7 నుంచి పది రోజుల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు(స్పెషల్ డ్రైవ్) చేపట్టాలని సూచించినా ఎక్కడా పూర్తిస్థాయిలో అమలు కావడంలేదు. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ కొరవడంతో నామమాత్రంగా సాగుతోంది. వీటి నిర్వహణకు గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత సమస్యగా మారింది.

ప్రత్యేకాధికారులు అందుబాటులో ఉండాలి



గ్రామ పంచాయతీల్లో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. ప్రత్యేకాధికారులు అందుబాటులో ఉండి గ్రామ పాలనపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలి. గ్రామాల్లో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించిన నేపథ్యంలో వెంటనే చర్యలు చేపట్టాలి.

– జకరయ్య, విద్యానగర్

అధిక దిగుబడి సాధించాలి

కిసాన్ దివస్ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు



మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ

సింగరేణి(కొత్తగూడెం): రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడి సాధించాలని శాస్త్రవేత్తలు సూచించారు. గురువారం కొత్తగూడెం ఆకాశవాణి కేంద్రం నుంచి స్టేషన్ ప్రోగ్రామ్ హెడ్ బైరి శ్రీనివాస్ అధ్యక్షతన కిసాన్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ, వైరా కృషి విజ్ఞాన కేంద్ర కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్, జిల్లా ఉద్యానశాఖ అధికారి జినుగు మరియన్న, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.శిరీష మాట్లాడుతూ పురుగు మందుల పిచికారీ, కలుపుతీత, పంటల కోత, నూర్పిడి తదితర పనులకు అధునాతన వ్యవసాయ పరికరాలు వినియోగించాలని సూచించారు. భూసారాన్ని బట్టి అధిక దిగుబడి ఇచ్చే వంగడాలను విత్తాలని, సేంద్రియ ఎరువులు వినియోగించాలని వివరించారు. అనంతరం ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లోని పలువురు ఆదర్శ, ఉత్తమ రైతులను ఆకాశవాణి అధికారులు, వ్యవసాయ అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ అవార్డు గ్రహీత గొర్ల సత్యనారాయణ, ఆదర్శ రైతు అవార్డు గ్రహీత గొట్టిపాటి వెంకటేశ్వరరావు, నూరి రాజశేఖర్, ఆకాశవాణి సిబ్బంది కొలిపాక శంకర్‌రావు, ట్రాన్స్ మిషన్ ఎగ్జిక్యూటివ్ బొల్లవరపు ప్రసాద్, శనగస్వామి, సాంకేతిక సిబ్బంది ఎస్.ఎన్ రెడ్డి ఎం.బాబుసింగ్, ప్రభాకర్, పి. ఆనందరావు పాల్గొన్నారు.

కిడ్నాప్ ప్రచారం ఊహాగానమే..

ఊపిరిపీల్చుకున్న పోలీసులు



సుభాష్‌నగర్‌లో ప్రత్యక్షమైన తల్లీకూతుళ్లు

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీలో యాచకులుగా జీవనం సాగిస్తూ ఓ చెట్టు కింద నివాసం ఏర్పాటు చేసుకున్న తల్లీకూతుళ్లు మైనా, దేవి హఠాత్తుగా కనిపించకపోవడంతో కిడ్నాప్ జరిగినట్లు వదంతులు వ్యాపించాయి. దీంతో సీఐ కరుణాకర్, పోలీసు సిబ్బంది తనిఖీలు, అటవీ ప్రాంతంలో గాలింపు చేపట్టారు. అయితే వారు ఉచిత బస్సు సౌకర్యం వినియోగించుకొని మేడారం వెళ్లి భిక్షాటన చేసుకుని గురువారం తిరిగి సుభాష్‌నగర్‌కు చేరుకున్నారు. దీంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

మతిస్థిమితంలేని గర్భిణికి కాన్పు సేవలు

వైద్యులు, సిబ్బందికి డీసీహెచ్‌ఎస్ అభినందన



పుష్పావతితో కేక్ కట్ చేయిస్తున్న వైద్యులు

అశ్వారావుపేటరూరల్: మతిస్థిమితం లేని నిండు గర్భిణికి ప్రభుత్వ వైద్యులు కాన్పు చేసి తల్లీబిడ్డలను కాపాడారు. అశ్వారావుపేటలోని తూర్పు బజారుకు చెందిన రొయ్యల పుష్పావతి నిండు గర్భిణి కాగా, పురిటి నొప్పులు రావడంతో ఆమె తల్లి ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తీసుకొచ్చింది. పరీక్షించిన వైద్యులు ఆమెకు సాధారణ కాన్పు చేయగా, పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. కాగా పుష్పావతికి మతిస్థిమితం లేకపోవడంతో కాన్పు చేసేందుకు సహకరించలేదు. దీంతో ఆస్పత్రి వైద్యులు ఎంతో ఓర్పుతో నచ్చజెప్పి కాన్పు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. అనంతరం ఆమె చేతుల మీదుగా కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా వైద్యులను, సిబ్బందిని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు ప్రత్యేకంగా అభినందించారు. వైద్య సేవలందించినవారిలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయ్ కుమార్, ఆర్‌ఎంవో డాక్టర్ కృష్ణ కాంత్, నర్సింగ్ సూపరింటెండెంట్ రామలక్ష్మి, సిబ్బంది ప్రమీల రాణి, మంగ, శిరీష, ఎస్కే జిలానీ ఉన్నారు.

టాటా మ్యాజిక్, బైక్ ఢీ

ఒకరికి తీవ్రగాయాలు

చర్ల: మండలంలోని గోగుబాక సమీపంలో గురువారం మధ్యాహ్నం టాటా మ్యాజిక్, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. లక్ష్మీదేవిపల్లికి చెందిన భాస్కర్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై భద్రాచలం వైపునకు వెళ్తుండగా భద్రాచలం వైపు నుంచి చర్ల వైపునకు వెళ్తున్న టాటా మ్యాజిక్ వాహనం ఢీకొట్టింది. దీంతో భాస్కర్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పెనగడప శివారు ప్రాంతంలో పేకాట శిబిరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రూ. 5 వేలు స్వాధీనం చేసుకున్నారు. మరో వ్యక్తి పరారైనట్లు టూటౌన్ సీఐ రమేష్‌కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బంగారు గొలుసు అపహరణ

దమ్మపేట : బంగారు గొలుసు చోరీ ఘటనలో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని మందలపల్లి గ్రామానికి చెందిన మందలపు సత్యవతి (65) బుధవారం రాత్రి అదే గ్రామంలోని తన కుటుంబ సభ్యులకు చెందిన దాబాలో భర్తతో కలిసి నిద్రిస్తోంది. ఈ క్రమంలో అర్ధరాత్రి రెండు గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో నుంచి 30 గ్రాముల బంగారు గొలుసును లాక్కున్నాడు. దంపతులు మేల్కొని పట్టుకునేందుకు ప్రయత్నించగా దుండగుడు పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

నలుగురు బంగ్లాదేశీయుల అరెస్ట్

- రెండు నెలలుగా కొత్తగూడెంలో నివాసం
- పెట్రోలింగ్‌లో పట్టుబడిన యువకులు



పోలీసులు పట్టుకున్న బంగ్లాదేశ్ యువకులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో నలుగురు బంగ్లాదేశీయులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు యువకులు గత మంగళవారం కొత్తగూడెం పోలీసులకు చిక్కగా వారి నుంచి పూర్తి వివరాలను రాబట్టేందుకు విచారణ జరుపుతున్నారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో కూడా ఇద్దరు బంగ్లాదేశ్ యువకులను పోలీసులు గుర్తించారు. పది రోజుల క్రితం ఖమ్మంలో ఈ నలుగురిపై కేసు కూడా నమోదైనట్లు తెలుస్తోంది. వారి వద్ద పాస్‌పోర్టు లేదని, అక్రమ మార్గంలో దేశంలోకి ప్రవేశించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది. వీరు కేవలం పని చేసి డబ్బులు సంపాదించి తిరిగి వారి దేశానికి వెళ్లాలనే ఉద్దేశంతో వచ్చారని, ఎటువంటి చట్టవిరుద్ధ కార్యక్రమాలకు పాల్పడేందుకు రాలేదనే విషయాలు విచారణలో బయటపడుతున్నట్లు సమాచారం.

కొత్తగూడెం గణేష్ టెంపుల్ ఏరియాలో..

బంగ్లాదేశ్ నుంచి వచ్చిన ఇద్దరు యువకులు కొత్తగూడెం గణేష్‌టెంపుల్ ఏరియాలో రెండు నెలలుగా రూంను అద్దె తీసుకుని నివాసముంటున్నారు. రోజు వారి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వన్, త్రీటౌన్ పోలీసుల పెట్రోలింగ్ చేస్తున్న నేపథ్యంలో గత మంగళవారం గణేష్‌టెంపుల్ ఏరియాలో పోలీసులకు చిక్కారు. దీంతో అదుపులోకి తీసుకుని విచారించగా, వారి వద్ద పాస్‌పోర్టు, ఇతర ధ్రువీకరణ పత్రాలు లేవని తేలింది. రెండు నెలలుగా వారు కొత్తగూడెంలో నివాసముంటున్నా పోలీసులకు, ఇంటెలిజెన్స్ విభాగానికి సమాచారం లేకపోవడం గమనార్హం. నిఘా వైఫల్యం వల్లే ఇతర దేశాల నుంచి అక్రమంగా వస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికే జిల్లా మీదుగా గంజాయి ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలకు వెళ్తోంది. తాజాగా అక్రమంగా దేశంలోకి వచ్చిన నలుగురు యువకులు పట్టుబడ్డారు. ఈ నేపథ్యంలో నిఘా మరింత పటిష్టం చేయాలని పలువురు కోరుతున్నారు.

గుండెం క్యాంపుపై మావోయిస్టుల కాల్పులు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టులు మరోమారు రెచ్చిపోయారు. బీజాపూర్ జిల్లాలోని పామేడు, చింతవాగు పోలీసు క్యాంపులపై దాడి ఘటనలు మరవకముందే గురువారం తెర్రెం పోలీస్‌స్టేషన్ పరిధి గుండెం గ్రామ సమీపాన ఏర్పాటు చేస్తున్న క్యాంపుపై దాడికి దిగారు. ఈ క్రమంలో మావోయిస్టులు, పోలీసు బలగాల నడుమ హోరాహోరీ కాల్పులు జరగగా, మావోయిస్టులు పారిపోయారు. అనంతరం ఆ ప్రాంతంలో బలగాలు సోదాలు నిర్వహించి మావోయిస్టులు అమర్చిన ఎనిమిది శక్తిమంతమైన మందు పాతరలను గుర్తించి నిర్వీర్యం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఊకే నరేందర్ (40) అనే వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. టేకులపల్లి మండలం తుమ్మలచెలక గ్రామానికి చెందిన నరేందర్ వ్యవసాయకూలి పనుల కోసం అత్తగారి ఊరైన బొజ్జాయిగూడెనికి ఆటోలో చేరుకున్నాడు. అనంతరం రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. రోడ్డుమీద పడిపోగా, అతనిపై నుంచి మరో వాహనం వెళ్లింది. తీవ్ర గాయాలు కాగా స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం ఇల్లెందు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

ఐదు ఇసుక లారీలు సీజ్



నిందితులు, లారీలతో పోలీసులు

పాల్వంచరూరల్: ఏపీ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు లారీలను గురువారం తెల్ల వారు జామున పోలీసులు పట్టుకున్నారు. అధికారుల కథనం ప్రకారం.. భద్రాచలం సరిహద్దు ప్రాంతం ఏపీలోని గుండాల నుంచి హైదరాబాద్‌కు తెల్లవారుజామున ఐదు లారీల్లో ఇసుక తరలిస్తున్నారు. ఈ క్రమంలో పాల్వంచ మండలం నాగారం కాలనీలో ఉన్న ఆర్‌టీఏ చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ బి.శ్రీనివాస్, ఆర్టీఏ జైపాల్‌రెడ్డి, మైనింగ్ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి పట్టుకున్నారు. ఇసుక లారీలకు తెలంగాణ రాష్ట్ర అనుమతులు లేకపోవడంతోపాటు ఓవర్‌లోడుతో తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. దీంతో ఒక్కో లారీకి రూ. 85 వేల చొప్పున 4.25 లక్షల జరిమానా వధించారు. లారీలను సీజ్ చేసి డ్రైవర్లపై కేసు నమోదు చేశారు.

జేఈఈ మెయిన్స్‌లో గిరిబిడ్డల ప్రతిభ



వేణు



ఆకాష్

భద్రాచలం అర్బన్: ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో గిరిజన గురుకుల కళాశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఖమ్మం రీజియన్ నుంచి 258 మంది బాలబాలికలు జేఈఈ మెయిన్స్‌కు హాజరుకాగా, 114 మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారు. ఇందులో సింగరేణి యూఆర్‌జేసీ విద్యార్థి వి.వేణు 92.74 శాతం, దమ్మపేట సీఓఈ విద్యార్థి డి.ఆకాష్ 90.77 పర్సంటైల్ సాధించి మొదటి రెండు స్థానాలు నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ గురువారం అభినందించారు.

ఆధునిక వ్యవసాయం వైపు అడుగులు వేయాలి

అదనపు కలెక్టర్ రాంబాబు



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రైతులు ఆధునిక వ్యవసాయం వైపు అడుగులు వేయాలని, తక్కువ వ్యయం, తక్కువ శ్రమతో అధిక దిగుబడులు సాధించే చైతన్యాన్ని పెంచుకోవాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం తెలంగాణ ఇన్నోవేషన్ సెల్, నాబార్డు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వన్‌డే వన్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అంతకు ముందు కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడారు. వ్యవసాయ పనులకు మ్యాన్ పవర్ దొరికే పరిస్థితులు తగ్గుతున్నాయని, అందుకే రైతుల నుంచి కూడా వ్యవసాయ శాస్త్రవేత్తలు వస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా పరిశ్రమల అధికారి సీతారాం మాట్లాడుతూ సమయాన్ని పొదుపు చేస్తూ చేసే వ్యవసాయం లాభదాయకమన్నారు. జిల్లా మైనార్టీ అధికారి సంజీవరావు మాట్లాడుతూ తాను ఉద్యోగ విరమణ పొందాక వ్యవసాయమే చేస్తానని వ్యాఖ్యానించారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి కొర్సా అభిమన్యుడు అధ్యక్షత వహించగా జిల్లా ఉద్యాన అధికారి జినుగు మరియన్న, జిల్లా సైన్స్ అధికారి చలపతిరాజు, కేవీకే ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ నారాయణమ్మ, టీఎస్ఐసీ అధికారి రమేష్‌గౌడ్, ఈడీఎం విజయసారథి, దేశీ కోఆర్డినేటర్ దామోదర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. జిల్లా విద్యా శాఖాధికారి వెంకటేశ్వరాచారి, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

సేవాలాల్ ఆశయ సాధనకు కృషి చేయాలి

ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్



సేవాలాల్ జయంతి వేడుకల్లో పీఓ తదితరులు

భద్రాచలంఅర్బన్ : బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ శ్రీసేవాలాల్ మహరాజ్ ఆశయ సాధనకు గిరిజనులు కృషి చేయాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ అన్నారు. స్థానిక గిరిజన భవన్‌లో గురువారం నిర్వహించిన సేవాలాల్ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. జాతి ఐక్యత కోసం అందరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. లంబాడాలు సేవాలాల్‌ను దేవుడిగా భావిస్తారని అన్నారు. సేవాలాల్ జంతు బలిని వ్యతిరేకించారని, తల్లిదండ్రులు, మహిళలను గౌరవించాలని ప్రజలకు బోధించారని పీఓ గుర్తు చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, భద్రాచలం ఆర్డీఓ మంగీలాల్, మొబైల్ కోర్టు జడ్జి బి. శివాజీ, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, జీసీసీ డీఎం విజయ్‌కుమార్, ఏటీడీఓ నర్సింగరావు, ఆత్మ కమిటీ చైర్మన్ ఎల్.వెంకటేశ్వర్లు, వి.కృష్ణ నాయక్ పాల్గొన్నారు.

రామాలయంలో వెండి బిస్కెట్ మాయం?

ఆడిటింగ్‌లో సిబ్బంది పాత్రపై విచారణ..!

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి సంబంధించిన ఖజానాలో నుంచి వెండి బిస్కెట్ మాయమైనట్లు ఆడిట్ అధికారులు గుర్తించినట్లు సమాచారం. రెండు రోజులుగా దేవస్థానం కార్యాలయంలో అధికారులు ఆడిటింగ్ నిర్వహిస్తున్నారు. కాగా ఆజాద్ ఈఓగా పనిచేసిన సమయంలో ఒక్కోటి 6 కేజీల బరువుతో 13 వెండి బిస్కెట్లు తయారు చేయించారు. భక్తులు స్వామివారికి బహూకరించిన వెండి వస్తువులను ఇందుకు వినియోగించారు. అందులో ఒక బిస్కెట్ ఖజానాలో లేనట్లు అధికారులు గుర్తించారు. బిస్కెట్ విలువ సుమారు రూ. 5 లక్షల వరకు ఉంటుందని, విచారణ చేస్తున్నామని అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఘటనలో ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ఉద్యోగి పాత్ర ఉందా? ఇతరుల పాత్ర ఉందా? లేదా ఆలయంలోనే ఇతర విభాగంలో ఉంచి మర్చిపోయారా? అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కాగా దేవస్థానంలో స్వామివారి వెండి, బంగారు ఆభరణాల్లో జరుగుతున్న అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరపాలని భక్తులు కోరుతున్నారు.